క్లుప్తంగా

సల్కర్‌పేట్‌లో తైబజార్ వేలం



గండేడ్: మండలంలోని సల్కర్‌పేట్‌లో తైబజార్ వేలం పాట సోమవారం సర్పంచ్ జితేందర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభలో నిర్వహించారు. ఊశన్న, కృష్ణయ్య, రామకృష్ణారెడ్డిలు రూ.2వేల చొప్పున డీడీలు కట్టి వేలంలో పాల్గొనగా, రూ.63,500లకు ఊశన్న తైబజార్ వేలాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామ్, రాధమ్మ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పేద రైతులకు పట్టాలు ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అంకిళ్ల గ్రామ పేద రైతుల భూములకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. అంకిళ్లలోని దళితులు, గిరిజనులు, బీసీలకు సర్వేనంబర్ 394లలో 58ఎకరాల భూమికి 38–ఏ టెనెంట్ ఉందని, అధికారులు రైతులకు పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అనేకసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. భూ యజమాని రైతుల మధ్య ఎలాంటి బేదాభిప్రాయాలు లేవని, వెంటనే రైతులకు పట్టా పొజిషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, బాలరాజు, బాలప్ప, పద్మమ్మ, వెంకటయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌నాయక్‌కు సన్మానం

నవాబుపేట: మండలానికి చెందిన శంకర్‌నాయక్ నగారభేరి లంబాడి హక్కుల పోరాట సమితి ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సోమవారం శంకర్‌నాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గణేష్, శంకర్ తులసీరాం, వెంకట్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

గండేడ్: మండలంలోని బీఆర్‌ఆర్ ట్రస్టు, బీఎంఆర్ ఫౌండేషన్ వారు పలు గ్రామాల్లో పలువురికి ఆర్థికసాయం అందజేశారు. సల్కర్‌పేట్‌కు చెందిన సంపల్లి చెన్నయ్య కుమారుడు అనంద్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. సోమవారం సర్పంచ్ జితేందర్‌రెడ్డి ట్రస్టు ద్వారా మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. వెన్నాచేడ్‌లో ఉప్పరి లక్ష్మమ్మ, సర్వర్‌బేగం ఆరోగ్యం బాగలేకపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు.

రెండు కరోనా కేసులు

గండేడ్: మండలంలోని రెండు గ్రామాల్లో ఇద్దరికి కరోనా పాజిటివ్ వచ్చింది. మండల కేంద్రంలో ఓ వ్యక్తికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. పంచాంగల్ తండాలో మరొకరు కరోనా బారిన పడినట్లు పేర్కొన్నారు.

పదవులు అనుభవించి విమర్శలు సరికాదు

రాజాపూర్: ప్రభుత్వంలో పనిచేసి పదవులు అనుభవించిన జూపల్లి కృష్ణారావు నేడు ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేయడం సరికాదని ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ జూపల్లికి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ అవకాశం కల్పించినా దురదృష్టవశాత్తు ఓడిపోయి పార్టీపైనే విమర్శలు చేయడం సరికాదన్నారు. పార్టీలో ఉన్నప్పుడు గౌరవించాలని, ఓపికగా ఉండాలని అన్నారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావ్, వైస్ ఎంపీపీ వెంకట్‌చారి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

జడ్చర్ల: మోటార్ బైక్‌ను కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో బైక్ నడుపుతున్న యువకుడు స్వల్ప గాయాలకు గురైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. పోలేపల్లి సెజ్‌లోని ఓ ఫార్మా పరిశ్రమలో చిన్నస్వామి అనే యువకుడు విధులు ముగించుకుని జడ్చర్లకు బైక్‌పై వస్తున్నాడు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపునకు వస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన సింధనూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న చిన్నస్వామి గాయపడ్డాడు. ఢీకొట్టి బస్సును ఆపకుండా వెళ్లడంతో చిన్నస్వామి మిత్రులు బస్సును అనుసరించి జడ్చర్ల వద్ద ఆపి డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అయితే తనపై దాడికి పాల్పడ్డారని డ్రైవర్ బీమన్న ఈ సందర్భంగా తెలిపాడు. ఒకరిపై ఒకరు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీచైర్ పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీచైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమైక్య సమావేశ హాల్‌లో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వేసవికాలం ఉన్నందునా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు, కరెంట్ సమస్యలు తలెత్తుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డ్‌లు, పల్లె ప్రకృతివనాలు, క్రీడా మైదానాలు వంటి పనుల్లో జాప్యం వహించరాదన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో, సంక్షేమ పథకాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, రాము, వైస్ ఎంపీపీ సుమతి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు అండగా ఉందాం

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



సంకలమద్దిలో మహిళా సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన వారు తప్పకుండా సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మూసాపేట మండలంలో సోమవారం ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పోల్కంపల్లి బీటీరోడ్డు రెన్యూవల్‌కు రూ.90లక్షలు మంజూరు కావడంతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పోల్కంపల్లి, కమాలొద్దీన్‌పూర్ దారిలో రూ.4.20కోట్ల నిధులతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సంకలమద్దిలో రూ.8లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. మూసాపేట మండల కేంద్రంలో రూ.10లక్షలతో నిర్మించిన వాల్మీకి కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. తిమ్మాపూర్‌కు చెందిన రైతు నర్సింహులు మృతిచెందడంతో రైతుబీమా ద్వారా వచ్చిన రూ.5లక్షల చెక్కును మృతుడి భార్య పద్మమ్మకు అందజేశారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికీ రూ.50వేల చొప్పున 6మందికి రూ.3లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలానికి చెందిన 46మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. నియోజకవర్గానికి చెందిన 32మంది లబ్ధిదారులకు రూ.14.69లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. జానంపేటకు చెందిన రిటైర్డ్ ఏఎస్‌ఐ నర్సింహారెడ్డితో పాటు మరికొందరు బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం చేసిందని తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మకుండా బీఆర్‌ఎస్‌కు మద్దతివ్వాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలుపై ఆరా



వివరాలు నమోదు చేసుకుంటున్న ముడా డైరెక్టర్ ఆంజనేయులు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు సంక్షేమ పథకాల అమలు తీరు గురించి ఆరా తీస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ఎవరికి ఏ మేరకు లబ్ధి చేకూరిందనే విషయం గురించి ఇల్లుల్లు తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. సోమవారం మండలంలోని ధర్మాపూర్‌లో ముడా డైరెక్టర్ కాడం ఆంజనేయులు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుబంధు, రైతుబీమా, పింఛన్, కేసీఆర్ కిట్టు, సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఓసీ, వరి ధాన్యం సేకరణ, రుణమాఫీ, ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీటి తదితరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సర్వే మంచి సత్ఫలితాలను ఇస్తుందని ముడా డైరెక్టర్ ఆంజనేయులు అన్నారు. సర్వేలో ధర్మాపూర్ గ్రామ అధ్యక్షుడు ఎం.విజయ్‌గౌడ్, నాయకులు బి.యాదయ్య, ఎం.సత్యనారాయణగౌడ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

భూములను కొల్లగొడుతున్న ప్రభుత్వం



తహసీల్దార్‌కు రుణమాఫీ దరఖాస్తులను అందజేస్తున్న అనిరుధ్‌రెడ్డి తదితరులు

రాజాపూర్: బీఆర్‌ఎస్ భూదందాలకు అడ్డాగా మారిందని టీపీసీసీ సెక్రటరీ జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి చేతులు దులుపుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో ఏకకాలంలో రూ.లక్ష రైతు రుణమాఫీ చేసిన ఘనత దక్కుతుందన్నారు. మండలంలో రైతు రుణమాఫీపై 800 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జడ్చర్లలో వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించని ఎమ్మెల్యే అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి స్థానికుడినైన తనను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అనంతరం తహసీల్దార్ రాంబాయికి రైతుల నుంచి సేకరించిన 800 రైతు రుణమాఫీ దరఖాస్తులను అందజేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వానికి తెలపాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సునిత, శంకర్‌నాయక్, యాదగిరిగౌడ్, అశోక్ యాదవ్, యాదయ్య, కృష్ణయ్య, నర్సింహాయాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం కేసీఆర్ శాసన సభలో ప్రకటించిన విధంగా ఏప్రిల్ మొదటి తేదీ వరకు 11వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులర్ కోసం ఎదురుచూస్తున్నారని, సీఎం హామీని అమలుపరిచే విధంగా అధికారులు తగిన చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వసతిగృహం పరిశీలన



మిడ్జిల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో గత గురువారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు హల్‌చల్ చేసిన సంఘటనపై సోమవారం తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి వసతిగృహాన్ని సందర్శించి వివరాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ వెంట ఎంపీటీసీ గౌస్, మాజీ ఎంపీటీసీ సంపత్‌కుమార్ ఉన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ

నవాబుపేట: మండలంలోని కాకర్లపహడ్ గ్రామస్తులు మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల భవనానికి గ్రామస్తులు దాతల సహకారంతో నిర్మించే అదనపు గదుల నిర్మాణం కోసం సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని రైతువేదిక చెంత నిర్మాణం చేసే అదనపు గదులను దాదాపుగా రూ.20లక్షలతో నిర్మాణం చేసేందుకు గ్రామస్తులు నిర్ణయం తీసుకుని పనులు ప్రారంభించారు. కాగా, ఇంటికి వంద బడికి చందా కార్యక్రమంలో గ్రామస్తులు కొంత మేర డబ్బులు జమ చేసిన తరుణంలో అదనంగా మరిన్ని దాతల ద్వారా స్వీకరించి విద్యార్థుల సౌకర్యం కోసం అదనపు గదుల నిర్మాణం చేపట్టనున్నట్లు గ్రామ ప్రజాప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగమ్మ, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, నర్సింహులు, సర్పంచ్ వసుంధర, సర్పంచ్ జంగయ్య, రైతుబంధు కోఆర్డినేటర్ సంజీవరెడ్డి, మాజీ మైసమ్మ ఆలయ చైర్మన్లు గోపాల్, సుభాన్, కృష్ణయ్య, నరేందర్ పాల్గొన్నారు.

మూసాపేటలో ఇఫ్తార్



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని మసీదులో సోమవారం రాత్రి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కెట్టిశేఖర్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు ఉన్న ముస్లింలకు పండ్లను తినిపించి దీక్షలను విరమింపజేశారు. తర్వాత మసీదులోనే ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాజొద్దీన్, నాయకులు ఖదీర్, ఖలీల్ తదితరులు ఉన్నారు.

భానుడి భగభగ.. జనం విలవిల

ఎండలు భగభగ మండుతుండడంతో ప్రజలు విలవిలలాడుతున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నప్పటికీ కార్యాలయాలు, వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లక తప్పడం లేదు. జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన రహదారులు మధ్యాహ్నం సమయంలో నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. కొందరు ఎండ నుంచి రక్షణకు గొడుగులు, టవళ్లు వంటివి వినియోగిస్తున్నారు. వివిధ పనులు చేసేవారు తప్పని పరిస్థితులు ఎండలోనే తమ పనులు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్



ఎండలోనూ మూటలు మోస్తున్న మహిళలు



టోపీలు, టవాళ్లు కప్పుకొని వెళ్తున్న పాదచారులు



నిర్మానుష్యంగా మారిన బస్టాండ్ చౌరస్తా



బైక్‌పై ఇలా..

స్వీయరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్



బెల్టులు పొందిన విద్యార్థులతో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్వీయరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యాదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని మయూరీ ఏకో అర్బన్ పార్క్‌లో సోమవారం జీకే షోటోకాన్ కరాటే క్లబ్, జిల్లా స్పోర్ట్స్ కరాటేడూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ అశ్వాక్ ఆధ్వర్యంలో సోమవారం రెండో రోజు విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకొని రాణించాలని కోరారు. విద్యార్థులకు చదువుతోపాటు కరాటే మార్షల్ ఆర్ట్స్, ఇతర క్రీడాంశాల్లో ప్రతిభచాటాలన్నారు. బెల్టు గ్రేడింగ్ పరీక్షలకు ఎగ్జామినర్‌గా సీనియర్ కరాటే మాస్టర్ ఇలియాజ్ బిన్ సిద్దిఖీ వ్యవహరించారు. బెల్టు గ్రేడింగ్ పరీక్షల్లో 70మంది కేశవరెడ్డి స్కూల్ విద్యార్థులు పాల్గొనగా, 50 మంది ఎల్లో బెల్టులు, 10మంది గ్రీన్, ఐదుగురు బ్లూ, ఐదుగురు ఆరెంజ్ బెల్టులు, సూఫ్ నాజ్ ప్రమోషన్‌లో గ్రీన్ బెల్టు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా కె.భరత్‌గౌడ్ బెల్టు గ్రేడింగ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ట్రోఫీ అందుకున్నట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా స్పోర్ట్స్ కరాటేడూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సయ్యద్ అశ్వాక్‌ను జెడ్పీ వైస్ చైర్మన్ తదితరులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీ డానిష్, డైరెక్టర్ నాగరాజు, కేశవరెడ్డి స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రహాస్ రెడ్డి, సుధాకర్‌గౌడ్, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో టీటీడీ నిధులతో కల్యాణ మండపం నిర్మాణం కోసం అధికారులు స్థల పరిశీలన చేశారు. టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ వీవీ నాగరాజు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఎ.జయలక్ష్మిలు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచన మేరకు సోమవారం మన్యంకొండకు చేరుకుని కల్యాణ మండప నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వివాహాలు చేసుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలతో కూడిన కల్యాణ మండపం నిర్మిస్తామని, వీలైనంత త్వరగా పనులను కూడా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. వారి వెంట ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఓబ్లాయిపల్లి సర్పంచ్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బాలకిషన్

జడ్చర్ల: ప్రజాసమస్యలపై నిరంతరంగా పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ తెలిపారు. పట్టణంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈనెల 14వరకు ఇంటింటా సీపీఐ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణయాదవ్, సభ్యులుగా అల్వాల్‌రెడ్డి, గోవర్ధన్, రాజు, సురేష్, మన్సూర్, ఖలీంలను ఎన్నుకున్నారు.

గ్రంథాలయాల్లో వసతులు కల్పిస్తాం



పనులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్

గండేడ్: గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటునందించేలా కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెన్నాచేడ్ గ్రంథాలయ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో విద్యార్థులకు విలువైన పరిజ్ఞానాన్ని అందించే విధంగా పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంచుతామన్నారు. వెన్నాచేడ్ భవనం పనులు అన్ని పూర్తి చేసి ఈనెలాఖరు వరకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఇప్పటికే రూ.13.5లక్షలతో అసంపూర్తి పనులు చేపట్టామని, నిధులు సరిపోకపోవడంతో జనరల్ ఫండ్ నుంచి అదనంగా విధులు వెచ్చించి కలరింగ్, ఫర్నీచర్, ర్యాక్‌లు వంటివి సమకూరుస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో అన్ని గ్రంథాలయాల్లో మెరుగయిన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, ఏఈ మక్బూల్ ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు



ధనలక్ష్మికాలనీలో స్ప్రే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 9, 10వ వార్డుల్లో ఇద్దరికి మలేరియా సోకడంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. ధనలక్ష్మి కాలనీ, మర్లు నుంచి పాల్కొండ వెళ్లే మార్గంలోని బాధితుల ఇళ్ల వద్దకు సోమవారం మున్సిపల్ సిబ్బంది వెళ్లారు. పరిసర ప్రాంతాల్లోనూ దోమల నివారణ మందు పిచికారీ చేశారు. మురుగు, చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఎస్‌ఐల నియామకం

దేవరకద్ర: నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లకు నూతనంగా పలువురు ఎస్‌ఐలు నియామయ్యారు. దేవరకద్ర ఎస్‌ఐగా ఎన్.వెంకటేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ భగవంతరెడ్డి నాగర్‌కర్నూల్ బదిలీ కాగా, అక్కడ నుంచి ఎస్‌ఐ వెంకటేష్ ఇక్కడికి బదిలీ అయ్యారు. మూసాపేట ఎస్‌ఐగా విజయభాస్కర్ బాధ్యతలు చేపట్టారు. మూసాపేట ఎస్‌ఐగా పనిచేసిన బి.నరేష్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. చిన్నచింతకుంట ఎస్‌ఐగా మోహన్‌బాబు బాధ్యతలు చేపట్టారు. చిన్నచింతకుంటలో పనిచేసిన ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డి భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. అడ్డాకుల ఎస్‌ఐగా మాధవరెడ్డి నియామయ్యారు. నాగర్‌కర్నూల్ డీఎస్‌బీలో పని చేసి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న విజయ కుమార్‌ను నాగర్‌కర్నూల్ వీఆర్‌కు బదిలీ చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని రామకొండ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్ రెండేళ్ల కిందట మృతిచెందింది. దీంతో పౌష్టికాహారం ఇవ్వడం కష్టంగా మారింది. ఇతర కేంద్రాల నిర్వాహకులకు అప్పజెపితే సక్రమంగా ఇవ్వకపోవడంతో సోమవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లమ్మ కేంద్రాన్ని పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు ఇబ్బందులు కలగకూడదని నెలకు సరిపడా బియ్యం, పప్పు, పాలు, నూనె అందజేశారు. పిల్లలకు గుడ్లు, బాలామృతం అందించారు.

భగవద్గీతను ప్రతిఒక్కరూ పఠించాలి

జడ్చర్ల: హిందువుల ఆరాధ్యా గ్రంథం భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు మద్దిగట్ల రాఘవేంద్రాచారీ తెలిపారు. సోమవారం మల్లెబోయిన్‌పల్లిలో ఇంటింటికీ వెళ్లి భగవద్గీత విశిష్టతను వివరించారు. భక్తిభావంతో ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రవికుమార్, మనోహర్, రమేశ్, మంజుల, యాది, సవిత తదితరులు పాల్గొన్నారు.